# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 17-05-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలోని మహిళలందరికీ ఆగస్టు 15వ తేదీ నుంచి ఉచిత బస్సు ప్రయాణ సదుయం కల్పిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- మహనీయులను ఆదర్శంగా తీసుకొని యువత ఉన్నత స్థానాలకు ఎదగాలని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఆకాంక్షించారు.
- ఉగ్రవాదాన్ని అణిచివేయడంలో భారత ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు.
- స్వర్ణాంధ్ర.. స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా పరిసరాల పరిశుభ్రతపై పలు కార్యక్రమాలను చేపట్టారు.

============================

రాష్ట్రంలోని మహిళలందరికీ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15వ తేదీ నుంచి ఉచిత బస్సు ప్రయాణ సదుయం కల్పిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈరోజు కర్నూలు జిల్లా పాణ్యంలో జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇల్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుతామని ప్రజలతో ప్రమాణం చేయించారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ... స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో పచ్చదనం పెంచాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రతి నెలా మూడో శనివారం ఇళ్లు, పరిసరాల్లోని శుభ్రతపై దృష్టి పెట్టాలని సూచించారు. అక్టోబరు 2 నాటికి రాష్ట్రంలో ఎక్కడా చెత్త లేకుండా ఉండేదుకు చర్యలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి వివరిస్తూ....

(వాయిస్ 32 సెకన్లు)

వినియోగదారులకు తక్కువ ధరకే నాణ్యమైన ఉత్పత్తులు అందజేయాలనే ఉద్దేశంతో రైతు బజార్లను ఏర్పాటు చేశామన్నారు. రైతు బజార్లకు సేంద్రియ కూరగాయలు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రపంచం గర్వించేలా విశాఖలో జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

============================

యువత విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అన్నారు. ఈరోజు అనంతపురంలోని జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జే.ఎన్.టి.యు.) 14వ స్నాతకోత్సవంలో గవర్నర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహనీయులను ఆదర్శంగా తీసుకొని యువత ఉన్నత స్థానాలకు ఎదగాలని, మంచి ఆలోచనలతో సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలన్నారు. దేశానికీ, సమాజానికి సేవ చేసి మంచి పేరు తీసుకురావాలన్నారు. వికసిత్ భారత్ దిశగా దేశం అడుగులు వేస్తోందని.. ఇందుకు యువత సహాయం ఎంతో అవసరం అన్నారు. విద్యార్థులు కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతిక పరిశోధనలపై దృష్టి సారించి వాటిలో నైపుణ్యం పొందాలని గవర్నర్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

============================

రాష్ట్రంలో ఈ రోజు రెండు వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. శ్రీకాకుళం జిల్లాలోని మెళియాపుట్టి మండలం దీనబందుపురం వీఆర్టీ గ్రానైట్ క్వారీలో ఈ రోజు జరిగిన పేలుడు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు.  ప్రమాదంలో మృతి చెందిన కార్మికులు తెర్లంగి రామారావు, బడబంద అప్పన్న, తమిళనాడుకు చెందిన వంగ వేణు ఆర్ముగంగా గుర్తించారు. క్వారీలో భారీ పేలుడు సంభవించిందని, ఆపై పిడుగుపడినట్లు క్వారీ యాజమాన్యం తెలిపింది.

మరోవైపు కాకినాడ జిల్లా తుని లో రోజు ఉదయం జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టిన సంఘటనలో ముగ్గురు మృతి చెందగా.. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న మృతులంతా రాజమహేంద్రవరం అపోలో ఫార్మసీకి చెందిన ఉద్యోగులుగా గుర్తించారు.

కాగా ఈ ప్రమాదంలో ముగ్గురి మృతి చెందడంపై రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని చెప్పారు.

విరామం

============================

ఉగ్రవాద చర్యలను ఎదుర్కోవడంలో ప్రపంచ దేశాల్లో భారత్ ముందు వరుసలో ఉందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ  అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో కూటమి పార్టీల ఆధ్వర్యంలో ఈరోజు  తిరంగ యాత్ర మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... పహల్గాంలో పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్రవాదులు దాడి చేసిన అనంతరం పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను భారత్ ధ్వంసం చేసిందన్నారు. భారతదేశం నిర్ణయానికి ప్రపంచ దేశాలు మద్దతుగా నిలిచాయన్నారు. ఉగ్రవాదాన్ని అణిచివేయడంలో కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఆయన వివరిస్తూ..

(వాయిస్ 30 సెకన్లు)

“ఆపరేషన్ సింధూర్” విజయాన్ని పురస్కరించుకొని భారత సైనిక త్రివిదళాలకు, మద్దతుగా తిరుపతి జిల్లా పుత్తూరులో ఈరోజు వెయ్యి అడుగుల జాతీయ జెండాతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. అమర వీరులకు జోహార్లు, భారత్ మాతాకీ జై, వందేమాతరం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ… విద్యార్థులు, యువత, మాజీ సైనికులు ర్యాలీలో పాల్గొన్నారు.

ఇక నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల  గ్రామంలో రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి  మాట్లాడుతూ, పహలగంలో జరిగిన ఉగ్రదాడికి

ప్రతీకార చర్యగా మన సైన్యం "ఆపరేషన్ సింధూర్"తో ఉగ్ర స్థావారాలను ధ్వంశం చేసి విజయం సాధించిందన్నారు. ఈ విజయం పట్ల భారత సైనికులకు సంఘీభావంగా దేశ వ్యాప్తంగా ప్రభుత్వం తిరంగా ర్యాలీని చేపట్టిందన్నారు.

============================

పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 19 నుంచి 28 వరకు జరగనున్నాయి. ఈ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని, పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని అనకాపల్లి జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో ఈ రోజు కలెక్టరు సమీక్ష నిర్వహించారు. పరీక్షల నిర్వహణకు సంబంధిత శాఖలు చేపట్టవలసిన చర్యలు గూర్చి తెలియజేసారు. పరీక్షా కేంద్రాలలో పరిశుభ్రత, మంచినీరు, వైద్య సదుపాయాలు, బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షల సమయంలో కరెంటు కోతలు ఉండకూడదని, విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొనేవిధంగా బస్సులు ఏర్పాటు చేయాలన్నారు.

============================

పశ్చిమ గోదావరి జిల్లాలోని నిడదవోలు పట్టణాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈరోజు నిడదవోలులో మున్సిపాలిటీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో పట్టణ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి చర్చించారు. అనంతరం పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే నిడదవోలు పట్టణాన్ని సుందరమైన నగరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన పనులు చేపడతామని తెలిపారు. గత 11 నెలలుగా నిడదవోలులో 105 కోట్ల 80 లక్షల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని వెల్లడించారు.

============================

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛత, పచ్చదనం కార్యక్రమాలను చేపట్టారు. ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సంయుక్త కలెక్టరు పి.ధాత్రిరెడ్డి ఇంకుడు గుంత నిర్మాణ పనులు ప్రారంభించి, మొక్కలను నాటారు. అనంతరం మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల మూడవ శనివారం పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛత కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. ఉష్ణోగ్రతలను నియంత్రించుకునే కార్యక్రమంలో భాగంగా ఈ వారం "బీట్ ద హీట్" ఇతివృత్తంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

ఇక మరోవైపు శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మం గ్రామంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్వచ్ఛందంగా చెత్తను తొలగించి... పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సందేశం ఇచ్చారు.

============================
============================